సాక్షి పెద్దపల్లి

బుధవారం, 7, ఫిబ్రవరి, 2024



పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి: బుధవారంపేట మాజీ సర్పంచ్ బుద్దార్థి బుచ్చయ్య నిర్మించిన 'ఓ విద్యార్థి కథ' షార్ట్ ఫిలిం పోస్టర్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం ఆవిష్కరించారు.



క్రషర్లలో అధికారుల తనిఖీలు

పాలకుర్తి: కన్నాల బోడగుట్టను ఆనుకుని ఉన్న క్రషర్లలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. కాలుష్యం తీవ్రత పరిశీలించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.4/22.4

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చట్ట విరుద్ధం



కట్టడాలు పరిశీలిస్తున్న అధికారులు

జ్యోతినగర్(రామగుండం): ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధి జంగాలపల్లె శివారు, ఇందిరమ్మకాలనీని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో అనుమతి లేనికట్టడాలను ఆమె తహసీల్దార్ కుమారస్వామి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలాల్లో కట్టడాలపై ఆరా తీశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులో మెప్మా ఆధ్వర్యంలో కియోస్కి చిరువ్యాపారుల కోసం నిర్మించిన దుకాణ సముదాయంలోని గదులను త్వరితగతిన కేటాయించాలని మెప్మా పీడీ రజనికి సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్, మెప్మా అధికారులు తదతరులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రం ప్రారంభం



భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న డీసీపీ చేతన

పెద్దపల్లిరూరల్: మహిళలు, బాలికల రక్షణ కోసం పట్టణ శివారులోని రంగంపల్లిలో ఏర్పాటు చేసిన 'భరోసా' కేంద్రాన్ని డీసీపీ చేతన మంగళవారం ప్రారంభించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని డీజీపీ రవిగుప్తా.. అడిషనల్ డీజీపీలు షికాగోయల్, మహేశ్‌భగత్‌తో కలిసి వర్చువల్ పద్ధతిన హైదరాబాద్‌లో ప్రారంభించారు. అదే సమయంలో డీసీపీ చేతన మంచిర్యాల జోన్ ఏసీపీలతో కలిసి రంగంపల్లిలో శిలాఫలకం ఆవిష్కరించారు. అనతరం డీసీపీ మాట్లాడారు. లైంగిక దాడులకు గురైన బాధితులకు సహాయసహకారాలు దీనిద్వారా అందిస్తారన్నారు. ఆశ్రయం కల్పించడంతోపాటు కౌన్సెలింగ్ ఇస్తారు. ఏసీపీలు మహేశ్, తుల శ్రీనివాసరావు, తిరుపతి, మోహన్, సదయ్య, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సదస్సు



డ్రోన్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

రామగిరి(మంథని): జేఎన్టీయూలో మెకానికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రోన్లపై జాతీయ స్థాయి వర్క్‌షాపు మంగళవారం ముగిసింది. స్పేస్ చేజ్ సహకారంతో డ్రోన్లపై వర్క్‌షాపు నిర్వహించారు. వివిధ కళాశాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రయోగాత్మకంగా వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తయారుచేసిన డ్రోన్లను క్రీడా మైదానంలో ఎగురవేశారు. ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు దుర్గారావ్, శ్రీనివాసులు, రాంనరేశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, ఫ్యాకల్టీ ఇన్‌చార్జి స్వప్న, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు సాయి, ఈశ్వర్, మేఘన , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మామిడితోట వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఎలిగేడు(పెద్దపల్లి): ముప్పిరితోట గ్రామపంచాయతీకి సంబంధించిన 295 సర్వే నంబర్‌లోని 22 ఎకరాల విస్తీర్ణంలో గల మామిడితోట నుంచి ఏప్రిల్, మేలో వచ్చే కాయలను తీసుకునేందుకు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. 8 మంది రూ.20 వేల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. అయితే, ముప్పిరితోటకు చెందిన ముత్యం లచ్చయ్య అత్యధికంగా రూ.6.01 లక్షలు పాట పాడి మామిడి కాయల హక్కులు దక్కించుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో, గ్రామప్రత్యేకాధికారి అనిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది రమేశ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'కారు'లో కుదుపు

- కారు దిగి హస్తం అందుకున్న బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత
- ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల ఓటమితో గులాబీ శ్రేణుల డీలా
- సార్వత్రిక ఎన్నికల వేళ సిట్టింగ్ ఎంపీ జంప్ కావడంతో నిస్తేజం
- వెంకటేశ్ రాకతో కాంగ్రెస్ ఆశావహుల్లో టికెట్‌పై ఉత్కంఠ



కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి,పెద్దపల్లి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. ఒకవైపు పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని అన్ని రాజకీయ పార్టీలు తమదైన పద్ధతిలో పావులు కదుపుతున్నాయి. ముఖ్యంగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బెల్లంపల్లిలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎంపీ బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలతో కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. మరోపక్క బీఆర్ఎస్ పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సమక్షంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నుంచి కండువా కప్పుకుని కాంగ్రెస్ పార్టీలో చేరి బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలువగా, ఇప్పుడు 'మూలిగేనక్కపై తాటికాయ పడ్డట్లు' బీఆర్ఎస్‌కు చెందిన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత ఆ పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో కారు కుదుపునకు గురైందని అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నిరాశలో ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు.. సిట్టింగ్ ఎంపీ పార్టీ మారడంతో మరింత నిస్తేజంలోకి వెళ్లారు.

ఆశావహుల్లో టెన్షన్

- ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 56శాతం ఓట్లురాగా, బీఆర్ఎస్‌కు 31శాతం, బీజేపీకి 6.5శాతం, ఇతరులకు 6.5శాతం ఓట్లు వచ్చాయి.
- దీంతో హస్తంగుర్తుపై పోటీచేస్తే విజయం 'నల్లేరుపై నడకే'నని భావిస్తున్న 29మంది ఆశావహులు టికెట్ల కోసం ఇటీవల దరఖాస్తు చేశారు.
- తాజాగా సిట్టింగ్ ఎంపీ కాంగ్రెస్‌లో చేరడంతో టి కెట్ ఆశిస్తున్న వారిలో అయోమయం నెలకొంది.
- వెంకటేశ్ నేతకు టికెట్ కేటాయిస్తారా, లేక కొత్తవారికే అవకాశం ఇస్తారా? అనేది తెలియక టెన్షన్ పడుతున్నారు.

పార్టీ మారడానికి కారణాలేంటి?

- అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్స్‌కు టికెట్లు కేటాయించడంతోనే పార్టీ ఓటమి చెందినట్లు బీఆర్ఎస్ అధిష్టానం భావిస్తోంది.
- దీంతో ఎంపీ ఎన్నికల్లో సిట్టింగ్‌లకు టికెట్లు దక్కడం కష్టమేననే ప్రచారంతోపాటు పార్టీ అధిష్టానం కొంతకాలంగా తనను దూరం పెట్టడంతో వెంకటేశ్ నేత పార్టీ మారినట్లు తెలుస్తోంది.
- పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశాల్లో ఎంపీ వెంకటేశ్ నేత కనిపించలేదు.
- దీంతోనే ఆయన బీజేపీ లేదా కాంగ్రెస్ వైపు చూస్తున్నారనే ప్రచారం జోరుగా సాగింది.
- అనుకున్నట్లుగానే మంగళవారం ఢిల్లీలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు.
- మరోవైపు.. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేలకు ఉన్న ప్రాధాన్యం ఎంపీలకు లేదనే భావనతోనే ఆయన పార్టీ మారినట్లు ఎంపీ అనుచరులు చెబుతున్నారు.
- గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంపీ స్థానిక ఎమ్మెల్యేల అనుమతిలేకుండా పర్యటించలేని పరిస్థితి నెలకొందని, ఎంపీ నిధులు సైతం వారి అనుమతితోనే ఖర్చుచేయాల్సి ఉండటంతో ప్రజలు, పార్టీ కేడర్‌తో నేరుగా సంబంధాలు ఏర్పరుచుకోలేని దుస్థితి నెలకొందని, అందుకే పార్టీ మారినట్లు ఎంపీ వర్గీయులు వివరిస్తున్నారు.

సొంతగూటికి ఎంపీ

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ నేత ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. ఉద్యోగానికి రాజీనామా చేసి 2018లో చెన్నూరు నుంచి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి బాల్క సుమన్ చేతిలో ఓటమిచెందారు. 2019మార్చి 21న కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పెద్దపల్లి ఎంపీగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌పై 95,180 ఓట్ల మెజార్టీతో గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టారు. 2019 సెప్టెంబరు 13 నుంచి 2020 సెప్టెంబరు 12 వరకు విదేశీ వ్యవహారాలపై స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2020 సెప్టెంబరు 13 నుంచి సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, చట్టం, న్యాయంపై స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకొని సొంతగూటికి చేరుకున్నారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లలో జాప్యం

- విసిగి.. వేసారి రోడ్డెక్కిన రైతులు
- రాజీవ్ రహదారిపై ధర్నా
- స్తంభించిన ట్రాఫిక్



రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న పత్తి రైతులు



కమాన్‌పూర్ మండలానికి చెందిన ఈ రైతు పేరు అనవేన రాజేశం. పత్తి అమ్ముకునేందుకు మంగళవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చాడు. గంటల కొద్దీ నిరీక్షించినా అధికారులు కొనుగోలు చేయలేదు. విసిగి వేసారిన రాజేశం.. అధికారులు ఈ నామ్ పద్ధతిన పత్తి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నా.. ఆచరణలో అమలు చేయడం లేదని ఆవేదన చెందాడు.

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఈ–నామ్ పద్ధతిన చేపట్టిన పత్తి కొనుగోళ్ల తీరుపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ పద్ధతిన వేగిరంగా సాగాల్సిన కొనుగోళ్లను ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు మంగళవారం మార్కెట్ ఎదుట రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తడంతో సమాచారం అందుకున్న సీఐ కృష్ణ, ఎస్సై మల్లేశ్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామని నచ్చజెప్పి రైతుల ఆందోళన విరమింపజేశారు.

మార్కెట్‌కు 1,700 క్వింటాళ్ల పత్తి..

జిల్లాలోని పలు మండలాల నుంచి 410మంది రైతులు 1,700 క్వింటాళ్ల మేర పత్తి విక్రయానికి తీసుకొచ్చారని మార్కెట్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కానీ, ఆన్‌లైన్ పద్ధతిన పత్తి తూకం వేసి, ధర నిర్ణయించడంలో జాప్యం జరిగింది. దీంతో తాము ఎన్నిగంటల పాటు వేచి ఉండాలని అన్నదాతలు.. అధికారులు, సిబ్బందిని నిలదీశారు.

సర్వర్ మొరాయిస్తోంది

సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక కారణాలతో పత్తి కొనుగోళ్లలో జాప్యం జరిగింది. గేట్ ఎంట్రీ మొదలు తూకం వేయడంలో ఆలస్యమైంది. రైతులు ఉదయం 9గంటలకల్లా మార్కెట్‌కు చేరుకోవాలని సూచించాం. ఎక్కువ మంది వచ్చారు. సర్వర్ మొరాయించడంతోనే కొనుగోళ్లలో సమస్య తలెత్తింది. రైతులతో మాట్లాడి తూకం వేయించి సమస్యను పరిష్కరించాం.

– దేవరాజ్‌పృథ్వీరాజ్, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి

లాభదాయక పంటలు పండించాలి

- పొరుగు రాష్ట్రాల్లో సాగుపై అవగాహన అవసరం
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



రైతులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

పెద్దపల్లిరూరల్: రైతులు లాభదాయక పంటలు పండించే విధానాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన రైతులు ఆయిల్‌పామ్ సాగును క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసేందుకు వీలుగా మంగళవారం కలెక్టరేట్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బయలుదేరి వెళ్లారు. అక్కడ ఆయిల్‌పామ్ సాగు విధానాలపై అవగాహన పెంచుకుంటారు. రైతులతో కలెక్టర్ కాసేపు సమావేశమై చర్చించారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలతోపాటు వాణిజ్య పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట గ్రామ రైతులతో పర్యటనకు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, ఉద్యావన అధికారి జగన్మోహన్‌రెడ్డి, నాబార్డ్ ఏజీఎం జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ జాప్యం



మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

- మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

జ్యోతినగర్(రామగుండం): పార్లమెంటు ఎన్నికల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం చేస్తోందని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఎన్టీపీసీలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, నగర మేయర్ అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుకు కేంద్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాలని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన మజీ సీఎం కేసీఆర్‌పై సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని పొరపాట్లు సరిద్దుకుని, నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తల మధ్య దూరం పూరించుకుందామని చెప్పారు. సమావేశంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, అంతర్గాం జెడ్పీటీసీ అముల నారాయణ, మహిళా నాయకురాలు మూల విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో దహనం చేశారు.

గృహజ్యోతి కోసం వివరాలు అందించండి



మాట్లాడుతున్న ఏఈ దామోదర్‌రావు

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన గృహజ్యోతి పథకానికి అర్హులైనవారు తమ ధ్రువీకరణ పత్రాలను రీడింగ్ నమోదు ఉద్యోగులకు సమర్పించాలని ఎన్‌పీడీసీఎల్ ఏఈ దామోదర్‌రావు తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు.. తమ ఇళ్లలోని మీటరు రీడింగ్ తీసుకునేందుకు వచ్చే విద్యుత్ అధికారులకు ఇంటి యజమాని ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు, ఓనర్ సెల్ నంబరు ఇవ్వాలని ఆయన సూచించారు. అద్దె ఇళ్లలో ఉండేవారు తమ రేషన్, ఆధార్ జిరాక్స్‌లతోపాటు ఇంటి యజమాని సెల్ నంబరు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ ధ్రువీకరణ పత్రాలు ఇస్తేనే పథకానికి అర్హులు అవుతారని ఆయన వివరించారు.

పోలీస్ అభ్యర్థులకు జీజీహెచ్‌లో మెడికల్ ఫిట్‌నెస్

- పర్యవేక్షిస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీసీ సుందర్‌రావు



అభ్యర్థులను పరీక్షిస్తున్న వైద్యనిపుణులు

కోల్‌సిటీ(రామగుండం): పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనున్న నేపథ్యంలో అభ్యర్థులకు గోదావరిఖనిలోని జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ప్రత్యేక వైద్య బృందంతో అభ్యర్థులకు పలు పరీక్షలు చేపట్టారు. ఈ ప్రక్రియను డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ సుందర్‌రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ పర్యవేక్షించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో 587 మంది అభ్యర్థులకు ఐదు రోజులపాటు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. సోమవారం ప్రారంభించిన మెడికల్ ఫిట్‌నెస్‌లో రోజూ 120 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగాల ఎంపికకు తుది పరీక్షగా పేర్కొనే వైద్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం 121 మందికి, మంగళవారం 119 మంది అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆర్ఐ సంపత్, ఆర్ఎస్సై అమీద, జీజీహెచ్ ఆర్ఎంవోలు అప్పారావు, తిరుమలేశతోపాటు ఆస్పత్రిలోని స్పెషలిస్టులు పాల్గొన్నారు.

తప్పుతారా.. ఆపుతారా..!

- 2021 ఆగస్టులో వాట్సాప్‌లో లీకైన డిగ్రీ పేపర్లు
- చివరికి ఇద్దరిని నిందితులుగా చూపిన పోలీసులు
- ఉసూరుమనిపించిన అధికారుల విచారణ
- తప్పించుకున్న అనుమానిత కళాశాలల సిబ్బంది
- ఇప్పటికే దర్యాప్తు పూర్తయిందంటున్న పోలీసులు
- కొత్త చట్టం ప్రకారం విచారించాలంటున్న విద్యార్థి సంఘాలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: శాతవాహన యూనివర్సిటీ డిగ్రీ పేపర్ లీకేజీ విషయంలో పోలీసుల తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉంది. పరీక్ష సమయానికి ముందే పేపర్ లీకై నా.. పరీక్షను రద్దు చేయకుండా కేవలం ఇద్దరిని బాధ్యులను చేసి పోలీసులు చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ప్రశ్నాపత్రాల లీకేజీలపై కొరడా ఝుళిపిస్తూ కేంద్రం కొత్త చట్టం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతో రెండున్నరేళ్ల కిందట రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన 'శాతవాహన వర్సిటీ డిగ్రీ ప్రశ్నపత్రాల లీకేజీ' వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసును తాజా చట్టం ప్రకారం విచారించి నిందితులకు కఠిన శిక్ష అమలు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

2021లో ఏం జరిగింది..?

2021 ఆగస్టు 18న కరీంనగర్‌లోని శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉదయం పరీక్ష సమయానికి అర్ధగంట ముందే ఉదయం 9.30గంటలకు ఆ రోజు జరగాల్సిన ఫిజిక్స్ పేపర్–2 వాట్సాప్‌లో ప్రత్యక్షమైంది. తరువాత పలు స్టూడెంట్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. అంతకుముందు జరిగిన పేపర్–1 కూడా లీకైంది. 16వ తేదీన జరిగిన మ్యాథ్స్ పేపర్ కూడా లీకైందని అప్పట్లో ×సాక్షి₹ ఆధారాలు సంపాదించి ప్రచురించిన విషయం తెలిసిందే. తెలంగాణ మాల్‌ప్రాక్టీస్ యాక్ట్ కింద నమోదు చేసిన ఈ కేసును దర్యాప్తు చేసి పోలీసులు చార్జీషీటు కూడా వేసినట్లు సమాచారం. వేలాదిమంది విద్యార్థులు పరీక్షలు రాసిన పేపర్ ముందే లీకవడంతో అటు వర్సిటీ, ఇటు ప్రైవేటు కాలేజీలు యాజమాన్యాలు ఉలిక్కిపడ్డాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీంనగర్, సిరిసిల్లకు చెందిన కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల సిబ్బంది పరీక్షకు ముందే పేపర్ లీక్ చేసి తమ కాలేజీ విద్యార్థులకు మంచి మార్కులు రావాలని కుట్రపన్నినట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం ఈ కేసులో 'కొండను తవ్వి ఎలుకను పట్టిన చందం'గా కేవలం ఇద్దరిని నిందితులుగా చూపి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు మూటగట్టుకున్నారు.

కొత్త చట్టం ఏం చెబుతోంది..?

పబ్లిక్ ఎగ్జామినేషన్ బిల్–2024 ఏం చెబుతోందంటే.. ప్రభుత్వ సంస్థలు నిర్వహించే పబ్లిక్ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు, కొలువుల పరీక్షలకు సంబంధించిన పేపర్లు లీకయినా, సమాధాన పత్రాలు మార్చినా, అవకతవకలకు పాల్పడినా రూ.కోటి జరిమానా, పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తారు. తెలంగాణలో 2016లో ఎంసెంట్ పేపర్లు రెండుసార్లు, 2021లో శాతవాహన వర్సిటీ డిగ్రీ పరీక్షలు, 2023 ఏప్రిల్‌లో పదో తరగతి ప్రశ్నపత్రాలు, అంతకుముందు టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పలు పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకైన నేపథ్యంలో ఈ బిల్లు ప్రాధాన్యం సంతరించుకుంది.

రెండూ కరీంనగర్ కేంద్రంగానే..

పదో తరగతి లీకేజీ, శాతవాహన డిగ్రీ ప్రశ్నపత్రం లీకేజీకి కరీంనగర్‌కు సంబంధం ఉండడం గమనార్హం. పదో తరగతి లీకేజీ కేసులో ఎంపీ బండి సంజయ్‌ను అరెస్టు చేశారు. అది రాజకీయ దుమారానికి దారి తీసింది. అప్పటి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను సైతం విచారించిన విషయం తెలిసిందే. పదో తరగతి పేపర్ల లీకేజీలో లోతుగా, దూకుడుగా దర్యాప్తు చేసిన పోలీసులు.. డిగ్రీ ప్రశ్నపత్రాల లీకేజీలో అంతగాలోతుగా వెళ్లలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ రెండింటినీ ఒకే సెక్షన్ల కింద నమోదు చేసినప్పుడు దర్యాప్తులో మాత్రం శాతవాహన విషయంలో పక్షపాతంగా వ్యవహరించారని విద్యార్థులు విమర్శిస్తున్నారు. లీకేజీ అయిన కాలేజీ యాజమాన్యాలనుగానీ, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని చాలామంది విషయంలో ఉదాసీనంగా వ్యవహరించి, వారందరినీ వదిలేశారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. కేసు విచారణ, చార్జీషీటు పూర్తయిందని పోలీసు వర్గాలు సమాధానమిస్తున్నాయి.

కేసు పునర్విచారించాలి



2021లో శాతవాహనవర్సిటీ డిగ్రీ కాలేజీ పేపర్ల లీకేజీ ఘటన కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు లోతైన దర్యాప్తు జరపలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ కేసును మళ్లీ దర్యాప్తు జరపాలి. కేసుతో సంబంధం ఉన్న ప్రతీ ఒక్కరినీ తిరిగి ప్రశ్నించాలి. నిందితులకు కేంద్రం తీసుకువచ్చిన కొత్త చట్టం ప్రకారం శిక్షలు పడాలి.

– మణికంఠ, ఏఐఎస్ఎఫ్,రాష్ట్ర అధ్యక్షుడు

పోలీసుల తీరు బాధాకరం



ఎస్వీ డిగ్రీ పరీక్ష పత్రాల లీకేజీలో పోలీసుల దర్యాప్తు తూతూమంత్రంగా సాగినట్లుగా ఉంది. ఇంత పెద్ద వ్యవహారంలో కేవలం ఇద్దరే సూత్రధారులు అంటే నమ్మశక్యంగా లేదు. పలు కాలేజీల నుంచి పేపర్లు లీకయ్యాయని వాట్సాప్‌లో బయటపడ్డ పేపర్లు సాక్ష్యంగా నిలిచినా.. ఈ వ్యవహారంతో సంబంధమున్న మిగిలిన వారిని వదిలేయడం బాధాకరం.

– రాజేశ్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

ఇంటింటా తాగునీరు



మాట్లాడుతున్న డీపీవో చంద్రమౌళి

ఓదెల(పెద్దపల్లి): వేసవి దృష్ట్యా సమస్య తలెత్తకుండా ఇంటింటా తాగునీటి సరఫరా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన మంగళవారం గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటిలో క్లోరినేషన్ చేయాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రొటోకాల్ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. జీవో నంబరు 67ప్రకారం లేఅవుట్లకు అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ యాకన్న, ప్రత్యేకాధికారులు కుమారస్వామి, మౌనిక, స్రవంతి, సమ్మిరెడ్డి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యం సాధించాలి



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గోదావరిఖని: ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లి బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలని ఆర్జీ–2 ఎస్‌వోటూ జీఎం రవీందర్ కోరారు. మంగళవారం ఏరియా వర్క్‌షాప్‌లో మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ పర్యటించింది. ఈసందర్భంగా ఉద్యోగులకు సంస్థ స్థితిగతులు, ఉత్పత్తి, ఉత్పాదక వివరాలను తెలియజేయారు. సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, ముందున్న సవాళ్లు, కంపెనీ లక్ష్యాలను సాధించడానికి ఉద్యోగుల బాధ్యతగా పనులు చేయాలని సూచించారు. ఈసందర్భంగా కార్మికుల సూచనలు, సలహాలు తీసుకున్నారు. అనంతరం కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో బ్రాంచి సెక్రటరీ జిగురు రవీందర్, కమిటీ సభ్యులు రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, ఎర్రన్న, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొనాలి



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: భారత్ బంద్‌లో భాగంగా ఈ నెల 16న చేపట్టే సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. మంగళవారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్మిక వర్గానికి ఆదాయ పన్ను స్లాబుల్లో ఏమాత్రం మార్పు చేయకుండా మూడు నెలల జీతాన్ని ఆదాయపన్ను రూపేనా కేంద్ర ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. చివరకు కార్మికులు కష్టపడి దాచుకున్న పట్టు పైసలకు సైతం వడ్డీ వేసే విధంగా చట్టాలు చేశారని ధ్వజమెత్తారు. ప్రభుత్వరంగ సంస్థల్లో విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ, లాభాల్లో నడుస్తున్న బొగ్గు గనులను ఇతరులకు కట్టబెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రావు, వంగల రాములు, శంకర్, సమ్మయ్య, రాజు, నందు, నారాయణ, బాదె రవి, సంతోష్ రాజమౌళి, కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై కొరడా

పెద్దపల్లిరూరల్: వ్యవసాయ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా మార్చడం చట్ట విరుద్ధమని ఎంపీవో సుదర్శన్ అన్నారు. పెద్దబొంకూర్ శివారులో ఏర్పాటు చేసిన వెంచర్‌లో మంగళవారం పంచాయతీ అధికారులు, సిబ్బంది హద్దురాళ్లను తొలగించారు. లే అవుట్ అనుమతి పొందిన భూముల్లోనే ప్లాట్లు కొనుగోలు చేయాలని అధికారులు పేర్కొన్నారు.



బిరుదు రాజమల్లు భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు విజయరమణారావు, వివేక్ తదితరులు



రాజమల్లు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ భానుప్రసాదరావు తదితరులు



గోదావరిఖని : నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న పెద్దపల్లి డీసీపీ చేతన తదితరులు



బిరుదు రాజమల్లు కుటుంబసభ్యులను ఓదార్చుతున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

జననేతకు కన్నీటి వీడ్కోలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): గుండెపోటుతో కన్నుమూసిన పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లుకు అభిమానులు, కార్యకర్తలు, బంధువులు, వివిధ వర్గాలు, రాజకీయ పార్టీల నేతలు కన్నీటి వీడ్కోలు పలికారు. తమ ప్రియతమ నేతను కడసారి చూసుకునేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లానుంచి భారీగా తరలివచ్చారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో పార్థివదేహం సందర్శించి నివాళి అర్పించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు,



పాడె మోస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు

చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, బీఆర్‌ఎస్ నేత రాకేశ్ తదితరులు రాజమల్లు పాడే మోశారు. దహన సంస్కారాలు పూర్తయ్యే వరకూ విజయ రమణారావు అక్కడే ఉన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు, మాజీ మంత్రి గుడిసెల రాజేశంగౌడ్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మాజీ ఎమ్మెల్యేలు చందుపట్ల రాంరెడ్డి, ఆరేపల్లి మోహన్, డీసీపీ గిరిప్రసాద్, ఏసీపీలు సాయిబాబా, రాజేంద్రప్రసాద్, మాజీ డీసీపీ సుదర్శన్ గౌడ్, మల్లారెడ్డి, మాజీ చైర్మన్ రాకేశ్‌కుమార్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష తదితరులు బిరుదు రాజమల్లుకు కన్నీటివీడ్కోలు పలికారు. పెద్ద కుమారుడు బిరుదు రాధాకృష్ణ దహన సంస్కారాలు నిర్వహించారు. పట్టణంలో వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి.



అంతిమయాత్రకు హాజరైన అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు

వందశాతం వసూలు లక్ష్యం

- గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి
- ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 67శాతం నమోదు
- మార్చి వరకు లక్ష్యం చేరుతామంటున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను, నల్లా బిల్లుల వసూలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మార్చి వరకు నూరుశాతం నమోదు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని 13మండలా(రామగుండం కార్పొరేషన్, మండలం మినహా)ల్లో గల 266 గ్రామ పంచాయతీల నుంచి మొత్తం రూ.6,17,95,507 వసూలు కావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.4,15,63,754(67.26శాతం) వసూలైనట్లు జిల్లా పంచాయతీ అధికారుల గణాంకాలను బట్టి తెలుస్తోంది. మిగతా ఆస్తిపన్ను, నల్లా బిల్లులను మార్చి చివరినాటికి వసూలు చేస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ముత్తారం టాప్..

- ఆస్తిపన్ను వసూళ్లలో ఇప్పటివరకు జిల్లాలోని ముత్తారం(మంథని) మండలం 88.66 శాతం నమోదు చేసి అగ్రస్థానంలో నిలిచింది.



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న పంచాయతీ ఉద్యోగులు

- పెద్దపల్లి మండలం కేవలం 55.90 శాతం వసూళ్లతో ఆఖరు స్థానంలో ఉంది.
- ఆస్తిపన్ను మందకొడిగా వసూలయ్యే మండలాలు, గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.
- ఆస్తిపన్ను, కుళాయి బిల్లులు సకాలంలో చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని అధికారులు, సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు.

స్పెషలాఫీసర్ల పాలనలో..

గ్రామ పంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం మొన్ననే ముగిసింది. దీంతో పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. పంచాయతీ కార్యదర్శులు, స్పెషలాఫీసర్లు గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించడంతోపాటు పారిశుధ్యం నిర్వహణపైనా స్పెషల్ ఫోకస్ పెట్టాలని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశించారు. ఈనెల 7నుంచి పారిశుధ్యంపై వారంపాటు స్పెషల్ నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వాటితోపాటు ఆస్తిపన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

లక్ష్యం సాధిస్తాం



ఆస్తిపన్ను వసూలు లక్ష్యం సాధిస్తాం. జిల్లాలోని కొన్ని మండలాల్లో వసూళ్ల తీరు మెరుగ్గానే ఉంది. మందకొడిగా సాగే పంచాయతీలను గుర్తించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఇందుకోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ప్రతీ పంచాయతీకో స్పెషలాఫీసర్‌ను నియమించాం.

– చంద్రమౌళి, డీపీవో

ఆస్తిపన్ను, నల్లాబిల్లుల వసూలు తీరు ఇలా..

మండలం	డిమాండ్ (రూ.లలో)	వసూలు (రూ.లలో)
ముత్తారం	28,17,898	24,98,409
సుల్తానాబాద్	78,91,722	57,61,952
అంతర్గాం	36,42,891	26,47,773
రామగిరి	35,98,513	25,52,557
పాలకుర్తి	60,28,296	42,64,011
ఓదెల	65,36,935	45,49,386
ఎలిగేడు	19,60,071	13,64,026
శ్రీరాంపూర్	55,92,919	38,38,807
జూలపల్లి	18,16,373	12,11,053
మంథని	32,20,515	21,22,221
కమాన్‌పూర్	32,36,839	19,72,602
ధర్మారం	61,19,624	35,64,226
పెద్దపల్లి	93,32,911	52,16,731

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్
- బొగ్గు ఉత్పత్తిపై కార్మికులు, ఉద్యోగులకు అవగాహన

గోదావరిఖని: నిర్దేశితల లక్ష్యాలకు అనుగుణంగా సింగరేణి అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. జీడీకే–1,3 గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంకితభావం, సమష్టి కృషితో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు. వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సంస్థ లాభాల బాటలో పయనిస్తుందని అన్నారు. భూగర్భ



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గనుల్ల యంత్రాల వినియోగం పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఉత్పాదకత వ్యయం కన్నా ఉత్పత్తి వ్యయం అధికంగా ఉందని తెలిపారు. భూగర్భ గనుల్లో నష్టాలు తగ్గించేందుకు వార్షిక లక్ష్యాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీరు రాంమూర్తి, ఏజీఎం(పర్సనల్) లక్ష్మీనారాయణ, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, డీజీఎం(క్వాలిటీ) అమరేందర్‌రెడ్డి, ఏజెంట్ బానోతు సైదులు, మేనేజర్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు

- పెద్దపల్లిలో ఇద్దరు దొంగల పట్టివేత

పెద్దపల్లిరూరల్: జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతోనే దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని మంగళవారం పెద్దపల్లి పోలీసులు పట్టుకున్నారు. సీఐ కృష్ణ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలని టీచర్స్ కాలనీకి చెందిన ఎరవెల్లి వేణుగోపాల్‌రావు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. దొంగలు ఇంట్లోకి జొరబడి 18తులాల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఆటో నడిపి జీవించే విజయ్‌కుమార్ జల్సా జీవితానికి అలవాటుపడి జనగాంలో దొంగతనం చేస్తూ పోలీసులకు చిక్కి జైలుకెళ్లాడు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై మహిళ మెడలో నుంచి చైన్‌తెంపి ఎత్తుకెళుతూ పోలీసులకు చిక్కాడు. జైలులో రాజు, విజయ్‌కుమార్ పరిచయమయ్యారు. వారిద్దరూ పెద్దపల్లిలోని టీచర్స్‌కాలనీలో దొంగతనానికి



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

పాల్పడి 18తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బంగారాన్ని కుదువపెట్టి కొంత నగదు తీసుకుని వస్తుండగా పెద్దకల్వల శివారులో పోలీసులు పట్టుకున్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ కృష్ణ, ధర్మారం బసంత్‌నగర్, పెద్దపల్లి ఎస్సైలు సత్యనారాయణ, వెంకటేశ్, మల్లేశ్‌తో పాటు సిబ్బంది ప్రభాకర్, రాజు, శివను డీసీపీ చేతన, ఏసీపీ మహేశ్ అభినందించారు.

దొంగలను పట్టిచ్చిన సీసీ కెమెరాలు..

చోరీపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు టీచర్స్ కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభాకర్‌రావు ఇంటి తాళం పగులకొట్టి బంగారు ఆభరణాలను దోచుకున్న వ్యక్తులు సిద్దిపేట జిల్లా రాఘవపురానికి చెందిన మునిగండ్ల విజయ్‌కుమార్, భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పొట్లపల్లికి చెందిన మీర్యాల రాజుగా గుర్తించారు. వారిని పోలీసులు పట్టుకుని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలవాలి

- ఆర్జీ–3 జీఎం సుధాకరరావు



మాట్లాడుతున్న జీఎం ఎన్.సుధాకరరావు

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో నంబర్‌వన్‌గా నిలవాలని ఆర్జీ–3 జీఎం సుధాకరరావు కోరారు. మంగళవారం ఓసీపీ–1 సైటాఫీస్‌లో ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించడంలో భాగంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, అంకితభావంతో పనిచేయాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 77 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలన్నారు. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎన్.రాధాకృష్ణ, ఏరియా ఇంజినీర్ ఎలీషా, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి నుంచి రవాణా వరకు రక్షణ చర్యలు అవసరం



మాట్లాడుతున్న గురువయ్య

- కార్పొరేట్‌సేఫ్టీ జీఎం గురువయ్య

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి ప్రారంభం నుంచి రవాణా అయ్యేంత వరకూ రక్షణ చర్యలు పటిష్టం చేపట్టాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సూచించారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన రక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసీపీలు, భూగర్భగనుల్లో ప్రమాదాలను నివారించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలన్నారు. ముందుగా రక్షణ చర్యలు పాటించిన తర్వాతే బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలని అన్నారు. రక్షణపై తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. సమావేశంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, ఏరియా ఇంజినీర్ రాంమూర్తి, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమిస్తేనే హక్కులు సాధ్యం

జ్యోతినగర్(రామగుండం): కార్మికులు సంఘటితంగా ఉద్యమిస్తేనే హక్కులు సాధించుకోవచ్చని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10ఏళ్లలో ప్రధాని మోదీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసిందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు రూపొందించడంతో రైతులు 13 నెలల పాటు ఉద్యమించారని గుర్తుచేశారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తయారుచేసి కార్మికులను బానిసలుగా మార్చేలా కుట్ర చేశారని ఆరోపించారు. కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికవర్గం జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, ఏఐకేఎంఎస్ అధ్యక్షుడు మేరుగు చంద్రయ్య, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఇనరేశ్, ఆర్.రాయమల్లు, టి.నర్సయ్య, భూమయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.